ప్రజాశక్తి
శుక్రవారం 24 నవంబరు 2023
5
శ్రీకాకుళం

3న జాతీయ ఉపకార వేతన పరీక్ష

శ్రీకాకుళం అర్బన్ : 2023–24 విద్యా సంవత్సరానికి గానూ డిసెంబరు మూడో తేదీన ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జాతీయ ఉపకార వేతన పరీక్షను నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల హాల్ టిక్కెట్లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్ www.bse.ap.gov.inలో స్కూల్ లాగిన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకొని పాఠశాల యు–డైస్ కోడ్‌ను ఉపయోగించి లాగిన్ కావాలని పేర్కొన్నారు. సకాలంలో వీటిని విద్యార్థులకు అందజేసి పరీక్షకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9505678655 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

వంశధార శివారు భూములకు షట్టర్ల కుంభకోణం కేసు అడ్డంకిగా మారింది. షట్టర్ల కొనుగోళ్లలో అవినీతిపై 2009లో సిఐడి కేసు నమోదు చేసింది. దీనిపై నేటికీ హైకోర్టులో విచారణ సాగుతోంది. ఘటన జరిగి 14 ఏళ్లు అవుతున్నా, నేటికీ విచారణ ఒక కొలిక్కి రాలేదు. విచారణ పెండింగ్‌లో ఉండడంతో, కాలువలపై కొత్త షట్టర్లను ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు సీజ్ చేసిన షట్టర్లు తుప్పు పట్టిపోవడంతో కోట్లాది రూపాయాల ప్రజాధనం వృథా అవుతోంది. సాగునీటి సలహా మండలి, జిల్లా సమీక్షా కమిటీ సమావేశాలు తదితర సందర్భాల్లో జలవనరులశాఖ అధికారులు పలు పర్యాయాలు ప్రస్తావిస్తున్నా, ప్రభుత్వం నుంచి స్పందన కనిపించడం లేదు. దీంతో కొత్తగా షట్టర్లు ఏర్పాటు చేసుకోలేక, పాడైన వాటితోనే నెట్టుకురావాల్సిన పరిస్థితి నెలకొంది.

నందిగాం మండలం నరేంద్రపురం వద్ద షట్టరు దుస్థితి

షట్టర్ల సమస్యకు పరిష్కారం ఎప్పుడు..?

- 2009లో షట్టర్ల కొనుగోళ్లలో అవినీతిపై సిఐడి కేసు
- కొత్త షట్టర్ల ఏర్పాటుకు అడ్డంకిగా కోర్టు కేసులు
- పలుచోట్ల శిథిలావస్థకు చేరిన షట్టర్లు
- శివారు భూములకు సాగు నీరందని పరిస్థితి

ప్రజాశక్తి – శ్రీకాకుళం ప్రతినిధి

నరసన్నపేట వంశధార ఇంజినీరింగ్ అధికారులు 2009లో కొనుగోలు చేసిన షట్టర్లలో బయటపడ్డ అవినీతి సాగు రంగానికి శాపంగా మారింది. అధిక ధరకు కొనుగోలు చేశారన్న ఆరోపణలపై సిఐడి రంగంలోకి దిగి విచారణ చేపట్టింది. ఇప్పటికీ ఆ కేసు కోర్టులో పెండింగ్‌లోనే ఉంది. 13 ఏళ్లు గడచినా కేసు తేలకపోవడంతో, కాలువలపై ఏర్పాటు చేయాల్సిన షట్టర్లు కార్యాలయాల్లోనే మూలుగుతున్నాయి. హిరమండలం, టెక్కలి, కోటబొమ్మాళి ప్రాంతాల్లో ఇంజినీరింగ్ కార్యాలయాల్లో సుమారు రూ.నాలుగు కోట్ల నుంచి రూ.ఐదు కోట్ల విలువ చేసే షట్టర్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి.

ప్రస్తుతం ఇవి పాడైపోవడంతో కాలువలపై బిగించడానికి అవకాశం లేకుండా పోయింది. వీటిని వేలం వేసి కొత్తగా కొనుగోళ్లు చేయాల్సి ఉంది. అలా చేయాలంటే ప్రభుత్వం కేసును సాధ్యమైనంత తొందరగా ముగింపు పలకాల్సి ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి ఇంజినీరింగ్ అధికారులు కొంతమంది జైలుకు వెళ్లారు. ఒకరిద్దరు మరణించారని కూడా అధికారులు చెప్తున్నారు. కేసును ఇంకా కొనసాగించినా ఫలితమేమీ ఉండదని, పైగా శివారు భూములకు సాగునీటి సమస్య పునరావృతమవుతూనే ఉంటుందని పలువురు ఇంజినీరింగ్ అధికారులు చెప్తున్నారు.

సాఫీగా సాగని సాగునీటి ప్రవాహం

వంశధార ఎడమ కాలువ సామర్థ్యం 2,450 క్యూసెక్కులు కాగా, కాలువ గట్లు బలహీనంగా ఉండడంతో 1800 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. కుడి కాలువ సామర్థ్యం 800 క్యూసెక్కులు కాగా, 500 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. కాలువల ఆధునీకరణ జరగకపోవడంతో గట్లు బలహీనంగా ఉన్నాయి. కాలువల్లో గుర్రపుడెక్క, పూడికతీత బాగా పేరుకుపోవడంతో సాగునీటి ప్రవాహం సక్రమంగా సాగడం లేదు. కాలువల్లోకి విడిచిపెడుతున్న నీరు సామర్థ్యం కంటే తక్కువగా ఉండడం, మరో షట్టర్లు లేకపోవడంతో సాగునీటి ప్రవాహం సాఫీగా సాగడం లేదు. షట్టర్ల అవినీతిపై ఉన్న కేసుకు ప్రభుత్వం సత్వరమే స్వస్తి పలకాలని రైతులు కోరుతున్నారు.

శిథిలావస్థలో షట్టర్లు

హిరమండలం గొట్టాబ్యారేజీ ద్వారా వంశధార కుడి, ఎడమ కాలువల కింద 2.50 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇందులో ఎడమ కాలువ ద్వారా 1.70 లక్షల ఎకరాలు, కుడి కాలువ ద్వారా 80 వేల ఎకరాలకు నీటిని అందించాల్సి ఉంది. దాదాపుగా అన్నిచోట్ల షట్టర్లు శిథిలావస్థకు చేరాయి. మరికొన్ని చోట్ల కొత్తగా షట్టర్లను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలూ పెండింగ్‌లోనే ఉండిపోయాయి. సాగునీటి ప్రవాహంపై నియంత్రణ లేకపోవడంతో ఎడమ కాలువకు సంబంధించి పోలాకి, సంతబొమ్మాళి, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని భూముల వరకు వంశధార పారడం లేదు. కుడి కాలువకు సంబంధించి గార మండలంలోని భూములు ఎండిపోతున్నాయి.

దళిత మహిళపై దాడి అమానుషం

- నిందితులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి
- కెవిపిఎస్, వ్య.కా.స నాయకుల డిమాండ్

పరామర్శిస్తున్న కెవిపిఎస్, వ్య.కా.స నాయకులు

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

పోలాకి మండలం చీడివలసకు చెందిన దళిత మహిళ కాయ పార్వతిపై పెత్తందారుల దాడి అనుమానుషమని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు భవిరి కృష్ణమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈశ్వరమ్మ ఖండించారు. ఆమెపై దాడి చేసిన ఆ గ్రామ పెత్తందారులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పార్వతిని గురువారం పరామర్శించి, దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. చీడివలసకు చెందిన అగ్ర కుల పెత్తందారుడైన చెక్క సింహాచలం కుమార్తె, తన కుమారుడు కాయ ఇసాక్ ప్రేమించుకున్నారని పార్వతి తెలిపారు. వారు కనిపించకపోవడంతో పెత్తందారులు నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. పోలీస్‌స్టేషన్ నుంచి ఇంటికి తిరిగొస్తుండగా పెత్తందారులు మూకుమ్మడిగా మారణాయుధాలతో తనపై దాడి చేశారని చెప్పారు. పెట్రోల్ పోసి తగులబెట్టాలని ప్రయత్నించారని తెలిపారు. దీనిపై నాయకులు స్పందిస్తూ దాడి చేసిన పెత్తందారులపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని, గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ నగర కార్యదర్శి రాకోటి చిన్నారావు, మామిడి సూర్యనారాయణ, కె.శ్రీను, కాయ దుర్గారావు, వై.చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీ వారికే ఇళ్ల స్థలాలు

- పేదలకు ఇచ్చిన చోట బలవంతంగా లాక్కొంటున్నారు
- సమగ్ర దర్యాప్తు చేయాలి
- కలెక్టర్‌కు ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు లేఖ

ప్రజాశక్తి – కోటబొమ్మాళి

జగనన్న కాలనీలో పేదలకు కాకుండా అధికార పార్టీ నాయకులు, వారి కుటుంబసభ్యులు, బంధువులు, అనుచరులకు ఇళ్ల స్థలాలను కట్టబెట్టారని టెక్కలి ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ఆరోపించారు. పేదలకు ఇచ్చిన చోట్ల వారి నుంచి అధికార పార్టీ నాయకులు, అనుచరులు బలవంతంగా లాక్కొని ఎక్కువ మొత్తానికి అమ్ముకుంటున్నారని తెలిపారు. ఈమేరకు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌కు లేఖ రాశారు.

టెక్కలి మండలం జగతిమెట్ట దగ్గర జగనన్న కాలనీ, కోటబొమ్మాళి మండలం కొత్తపేట, కోటబొమ్మాళి, చీపుర్లపాడు గ్రామ పంచాయతీల్లో పేదలకు ఇవ్వాల్సిన ఇళ్ల స్థలాలను సర్పంచ్‌ల కుటుంబసభ్యులు, బంధువులు, వారి అనుచరులు, వైసిపి నాయకులకు మంజూరు చేశారని లేఖలో పేర్కొన్నారు. వీటిపై సమగ్ర విచారణ చేసి బాధ్యులు, ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్థలాల ఆక్రమణలు, అనధికార విక్రయాలను ఆపాలని విజ్ఞప్తి చేశారు. అధికార యంత్రాంగం స్పందించకుంటే రాబోయే టిడిపి ప్రభుత్వం వీటిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

25న జాబ్‌మేళా

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ప్రభుత్వ డిఎల్‌టిసి ఐటిఐ ఆవరణలో ఈనెల 25న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.సుధ ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో మెడ్‌ప్లస్ కంపెనీలో 60 పోస్టులు, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్సులో 20 పోస్టులు, రైతుబంధు ఎంటర్‌ప్రైజెస్‌లో 26 పోస్టులను భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. మెడ్‌ప్లస్‌లో ఫార్మాసిస్టు, ఫార్మసీ ఎయిడ్, సిఎస్ఎ ఆడిట్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. జీతం నెలకు రూ.11 వేల నుంచి రూ.20 వేల వరకు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సి ఆపై విద్యార్హత కలిగి 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు గల వారు అర్హులని తెలిపారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో సేల్స్ మేనేజర్ పోస్టులకు నెలకు జీతం రూ.16,500 నుంచి రూ.40 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ, ఎంబిఎ ఆపై విద్యార్హత కలిగిన వారు అర్హులని తెలిపారు. రైతుబంధు ఎంటర్‌ప్రైజెస్‌లో సేల్స్ ఆఫీసర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ప్రొడక్ట్ ప్రమోటర్స్, డెలివరీ ఎగ్జిక్యూటివ్, డ్రైవర్ల పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌సి ఆపై విద్యార్హత కలిగిన 20 నుంచి 45 ఏళ్ల వయసు గల స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు బయోడేటా, సర్టిఫికేట్లు, ఆధార్ కార్డు తీసుకురావాలని తెలిపారు. అభ్యర్థులు తమ విద్యార్హత వివరాలను WWW.NCS.GOV.IN వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

డిగ్రీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు పేషెంట్ రిలేషన్స్ అసోసియేట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సును కీట్స్ సహకారంతో కీట్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, నందిగామ, కృష్ణా జిల్లా, కిమ్స్ రీసెర్చ్ అండ్ ఫౌండేషన్ సహకారంతో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణా కాలంలో విద్యార్థులకు ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. రెండు నెలల శిక్షణ పూర్తయిన వెంటనే ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగాలు కల్పిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7680945357, 79950 13422, 9121999654 ఫోన్ నంబర్లను, రాగోలులోని జెమ్స్ ఆస్పత్రిలో గల కార్యాలయాన్ని గానీ సంప్రదించాలని సూచించారు.

26న వికలాంగుల క్రీడా పోటీలు

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈనెల 26న వికలాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యాన వికలాంగులు, హిజ్రాల క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఎడి కె.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని వికలాంగులను కేటగిరీల వారీగా (స్త్రీ , పురుషులకు వేర్వేరుగా) ఆటల పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయం పది గంటల నుంచి ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు మాస్టర్‌ప్లాన్‌పై సమావేశం

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరంతో పాటు పరిసర 11 మండలాలకు సంబంధించి శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ రూపొందించిన డ్రాఫ్ట్ మాస్టర్‌ప్లాన్‌పై ప్రజల నుంచి సూచనలు, సలహాలను తీసుకునేందుకు ఈనెల 24న ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో నిర్వహించే సమావేశానికి ఎల్‌టిపిలు, నగర ప్రముఖులు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, నగర అభివృద్ధికి కృషి చేస్తున్న వారు హాజరై మాస్టర్‌ప్లాన్‌పై సూచనలు, సలహాలను తెలియజేయాలని కోరారు.

565 మందికి కళ్యాణమస్తు, షాదీతోఫా

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్



నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

జిల్లాలో కళ్యాణమస్తు, షాదీతోఫా కింద 565 మంది లబ్ధిదారుల ఖాతాలకు రూ.3.32 కోట్లు జమ చేసినట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, వికలాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడపిల్లలకు జూలై–సెప్టెంబరు మధ్య వివాహమైన వారికి ఈ లబ్ధి చేకూర్చినట్లు చెప్పారు. వికలాంగులకు రూ.1.50 లక్షలు, ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.లక్ష, బిసిలకు రూ.50 వేల ఆర్థిక సహాయం ఇస్తున్నట్లు తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలనతో పాటు పిల్లల చదువులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ వై.విశ్వమోహన్ రెడ్డి, బిసి సంక్షేమ శాఖ అధికారి అనురాధ, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సెమినార్‌ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి – సోంపేట

సమావేశంలో మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

డిసెంబరు 3, 4 తేదీలలో శ్రీకాకుళంలో నిర్వహించే జాతీయ సెమినార్‌ను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, జిల్లా కార్యదర్శులు ఎన్.గణపతి, ఎస్.లక్ష్మీనారాయణ కోరారు. సోంపేటలోని సిఐటియు కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ సిఐటియు జాతీయ నాయకులు పర్సా సత్యనారాయణ శత జయంతి ఉత్సవాలు సందర్భంగా ఈ సెమినార్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిఐటియు జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత, రాష్ట్రంలోని పలు కార్మికోద్యమ నాయకులు, కార్మికులు జాతీయ సెమినార్‌కు హాజరవుతారని చెప్పారు. కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను సెమినార్‌లో చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డి.యామయ్య, పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుల గణన సర్వేకు సిద్ధం

- వచ్చే నెలాఖరుకు ప్రభుత్వ భవనాలు పూర్తి
- జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణంలో అలసత్వం వద్దు
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

ఈనెల 27 నుంచి ప్రారంభం కానున్న కుల గణన సర్వేకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. కలెక్టరేట్ నుంచి ఎంపిడిఒలతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. గ్రామాల వారీగా సర్వే సమాచారాన్ని రెండు రోజుల ముందే ప్రజలకు తెలిపేలా పత్రికా ప్రకటనలు స్థానికంగా విడుదల చేయాలని సూచించారు. గార మండలం రామచంద్రాపురంలో పైలెట్ సర్వే విజయవంతంగా పూర్తయిందన్నారు. జిల్లా కేంద్రంలో సర్వే కోసం హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలైన గ్రామ, వార్డు సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలను డిసెంబర్ 31వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న ఈ పనులకు నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే పూర్తి చేసిన పనులకు బిల్లులు త్వరగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. 20 శాతం పనులు జరిగితే పూర్తయ్యే భవనాల విషయంలో ఎలాంటి అలసత్వం పనికి రాదన్నారు. ఏజెన్సీలు, ఇంజినీరింగ్ సిబ్బందితో ప్రతి వారం ఎంపిడివోలు సమీక్షించి నేరుగా కలెక్టరేట్‌కు నివేదిక పంపాలని ఆదేశించారు.

ఆరోగ్య సురక్షలో నాలుగు లక్షల మంది వైద్యులను కలిశారని, అందులో 5,450 మందికి ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సలు అవసరమని గుర్తించామన్నారు. వారిలో ఇప్పటివరకు 1583 మంది నెట్‌వర్క్ ఆస్పత్రులకు వెళ్లి చికిత్సలు చేయించుకున్నారని తెలిపారు. సెట్‌శ్రీ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రాకు కిట్లు సిద్ధంగా ఉన్నాయని, ఆదివారానికి ఆయా ఎంపిడిఒలు వీటిని మండల కేంద్రాలకు తీసుకువెళ్లే బాధ్యత తీసుకోవాలన్నారు. ఆటల పోటీలు నిర్వహించే రోజుల్లో ఆయా సచివాలయాలకు పంపించాలని చెప్పారు. వీటి రవాణా ఛార్జీల కోసం మండలానికి రూ.మూడు వేలు చొప్పున చెల్లిస్తామన్నారు. మైదానాలు సిద్ధం చేయడం, రిఫరీలను గుర్తించే పని వేగంగా పూర్తి చేయాలన్నారు.

26న వికసిత భారత్ సంకల్ప యాత్ర

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, అర్హులైన వారికి అందేలా చేయడం వికసిత భారత్ సంకల్ప యాత్ర ప్రధాన లక్ష్యమన్నారు. ఈ యాత్ర జిల్లాలో ఈనెల 26న ప్రారంభమై రెండు నెలల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంలో అలసత్వం వద్దన్నారు. లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయని ఎంపిడిఒలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా నోడల్ అధికారి వాసుదేవరావు, సిపిఒ వి.ఎస్.ఎస్ లక్ష్మీప్రసన్న, జిల్లా బిసి సంక్షేమ అధికారి అనురాధ, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, చీఫ్ కోచ్ శ్రీదర్, హౌసింగ్ పీడీ ఎన్.గణపతి, పంచాయతీరాజ్ ఎస్ఇ వి.ఎస్.ఎన్ మూర్తి, ఎంపిడిఒలు తదితరులు పాల్గొన్నారు.

నేడు అరసవల్లి హంస నావికోత్సవం

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

హంస నావికోత్సవానికి సిద్ధం చేసిన రథం

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 24న హంస నావికోత్సవం (తెప్పోత్సవం) నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇంద్రపుష్కరిణి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. తెప్పోత్సవ నిర్వహణకు అవసరమైన హంస వాహనాన్ని సిద్ధం చేయడంతో పాటు పుష్కరిణిలో ట్రయల్ రన్ కూడా వేశారు. ఉషా, ఛాయా, పద్మినీ సమేత సూర్యనారాయణ స్వామి ఉత్సవ విగ్రహాలతో తిరువీధి నిర్వహించిన అనంతరం వాటిని ఇంద్ర పుష్కరణి వద్దకు చేర్చి పూలతో ముస్తాబు చేసిన హంస నావిక రథంలోకి తీసుకొస్తారు. అక్కడ్నుంచి ఇంద్రపుష్కరిణిలో వేడుకలు ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్ మాట్లాడుతూ హంస వాహనాన్ని ఎటువంటి లోపాలు లేకుండా సిద్ధం చేశామన్నారు. మత్స్యశాఖ అధికారులు ఇచ్చిన సూచనల మేరకు బీమా కల్పించిన వ్యక్తులకు మాత్రమే తెప్పలోకి అనుమతిస్తారు. అదనంగా హంస వాహనంలోకి ఇతర వ్యక్తులను అనుమతించకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచామన్నారు. ఆలయంలో ద్వాదశి పర్వదినాన్ని పురష్కరించుకుని స్వామి వారికి ఉదయం 7 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు స్వర్ణాలంకరణ చేపడతామన్నారు. సందర్శకులకు మొబైల్ ఫోన్స్, కెమెరాలు అనుమతించబోమన్నారు.

రూ.20 కోట్లతో అంగన్వాడీ భవనాల ఆధునికీకరణ

ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ

ప్రజాశక్తి – పలాస

సమావేశంలో మాట్లాడుతున్న శాంతిశ్రీ

జిల్లాలో 1065 అంగన్వాడీ భవనాల ఆధునికీకరణకు ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసిందని ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలోని ఐసిడిఎస్ సూపర్‌వైజర్లతో అంగన్వాడీ భవనాల ఆధునికీకరణలో భాగంగా నాడు–నేడు కార్యక్రమంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అంగన్వాడీ పరిధిలో అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసి త్వరలో భవనాల ఆధునికీకరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి అంగన్వాడీ కేంద్రానికి రూ.రెండు లక్షల వరకు బిల్లు చేసే అధికారం ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారికి ఉందన్నారు. అంతకుమించి నిధులు మంజూరు చేయాలంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి సూపర్‌వైజర్ క్షేత్రస్థాయిలో పర్యటించి, అంగన్వాడీ కేంద్రాల వివరాలను జిల్లా కేంద్రానికి అందజేయాలన్నారు. సమావేశంలో సమగ్ర శిక్ష ఎపిసి రోణంకి జయప్రకాష్, ఐసిడిఎస్ నోడల్ అధికారి పి.మణెమ్మ, నాడు–నేడు డిఇ శ్రీనివాసరావు, ఎఇలు ఆర్.రాజేంద్రరెడ్డి, సునీల్ కుమార్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

జగన్‌తోనే గ్రామ స్వరాజ్యం సాధ్యం

ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఉపాధి హామీ నిధులు రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ సచివాలయం భవనాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ సచివాలయం వ్యవస్థ ద్వారా ప్రజలు ఆ గ్రామ పరిధిలోనే వారి సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లోనే విలేజ్ హెల్త్ క్లినిక్ ల ద్వారా ప్రాథమిక వైద్యం అందుతుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజని, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లన బాలరాజు, మండల పార్టీ కన్వీనర్ పల్లి యోగి, సర్పంచ్ ఎస్.లక్ష్మి పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

117 జిఒను రద్దు చేయాలి

ప్రజాశక్తి- పోలాకి

జిఒ నంబరు 117 ద్వారా ప్రాథమిక పాఠశాలలు పూర్తిగా నాశనమయ్యాయని, ఉపాధ్యాయ పోస్టులు రద్దయ్యాయని యుటిఎఫ్ జిల్లా కోశాధికారి బమ్మిడి శ్రీరామ్మూర్తి అన్నారు. పోలాకి బోర్డు ప్రాథమిక పాఠశాలలో సంపతరావు రాజేష్ అధ్యక్షతన గురువారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 3,4,5 తరగతులను ప్రాథమిక పాఠశాలలోనే కొనసాగించాలన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులు కోరాడ వైకుంఠరావు మాట్లాడుతూ ఆర్థిక సంబంధమైన పిఎఫ్‌లు, సరండర్ లీవు, ఎపిజి ఎల్‌ఐసిలు రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి పి.ఉమాభాస్కర్ ఏడాది కాలం చేసిన పోరాటాల నివేదికను తెలియజేశారు. అనంతరం పోలాకి మండలం నూతన కమిటీని ఎన్నిక నిర్వహించారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా కె.వెంకటరమణ, అధ్యక్షులు ఎస్.రాజేశ్వరరావు, సహాధ్యక్షులు ఎస్.శివదేవి. ఎం.సునీల్ గౌతమ్, ప్రధాన కార్యదర్శి పి.ఉమాభాస్కర్, కోశాధికారిగా ఎం.శ్యామలరావు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా టి.శ్రీనివాసరావు, కార్యదర్శులుగా, సిపిఎస్ కన్వీనర్లుగా, జిల్లా కౌన్సిలర్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి- ఆమదాలవలస

చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సనపల ఢిల్లేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలో గాజుల కొల్లివలస గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం కొనసాగిస్తున్న దమనకాండను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రశ్నించే గొంతుకను అక్రమ కేసులతో నొక్కేస్తున్నారని మండిపడ్డారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నర ఏళ్లలో సాధించిన ప్రగతి ఏమీ లేదన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తే ప్రజలకు అమలు చేసే కార్యక్రమాలపై వివరించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి కొయకొండ రమణమూర్తి, టిడిపి నాయకులు ఎండ భీష్మారావు, గుండ రవికుమార్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : పోస్టర్‌ను అందజేస్తున్న ఢిల్లేశ్వరరావు

మెళియాపుట్టి : మండలంలోని జాడుపల్లిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ పాల్గొన్నారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టో పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు భాస్కర్‌గౌడ, జిల్లా మహిళా ఉపాధ్యక్షులు బూర్ల లలిత కుమారి, జాడుపల్లి ఎంపిటిసి కదంబల సుజాత, రాజు, చాపర మాధవరావు, పరమేశ్వరరెడ్డి, బమ్మిడి భాస్కరరావు, మాలతి శ్రీధర్, దుక్క బాలరాజు, హనుమంతు చంద్రశేఖర్, అగాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టిడిపి నాయకులు బెండి అన్నపూర్ణ అన్నారు. మండలంలోని శ్రీజగన్నాథపురం పంచాయతీ బిర్లంగిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా టిడిపి మేనిఫెస్టో పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొర్రాయి మల్లేషు, సాసుమంతు ఆనంతరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : పోస్టర్‌ను అందజేస్తున్న వెంకటరమణ

రమేష్ మృతదేహం (ఇన్‌సెట్‌లో రమేష్ ఫైల్)

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పలాస

పలాస కోసంగిపురం కూడలి టిట్కో గృహాల సమీపం జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మందస మండలం మధ్య దేవుపురానికి చెందిన నెయ్యిల రమేష్ (48) అక్కడికక్కడే మతి చెందారు. కాశీబుగ్గ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మందస మండలం మధ్యదేవుపురానికి చెందిన నెయ్యిల రమేష్ కాశీబుగ్గ ప్రయివేటు ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. రోజూ స్వగ్రామం నుంచి కాశీబుగ్గ ఆస్పత్రికి బైక్ వెళ్లి వస్తుంటారు. అదేవిధంగా ఉదయం బైక్‌పై వస్తుండగా కోసంగిపురం కూడలి సమీపంలో ఇచ్ఛాపురం నుంచి కాశీబుగ్గ వైపు వస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి ప్రమాద స్థలంలోనే మృతి చెందారు. సమాచారం కాశీబుగ్గ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లారీని కోటబొమ్మాళి సమీపంలో లారీని అదుపులో తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న మృతుడు కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి వచ్చి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడు కాశీబుగ్గ రాజేశ్వరి ఆస్పత్రి 18 ఏళ్లుగా ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య నీలవేణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాశీబుగ్గ ప్రముఖ వైద్యులు డాక్టర్ మల్లిపెద్ది మల్లేశ్వరరావు మృతుడు కుటుంబ సభ్యులకు ఓదార్చారు. మధ్యాహ్నం స్వగ్రామంలో కుటుంబ సభ్యులు, బంధువుల నడుమ అంత్యక్రియలు నిర్వహించారు.

రోటరీ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి- సోంపేట

సామాన్యులకు రోటరీ క్లబ్ చేస్తున్న సేవలు అమోఘమని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యాన సోంపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజం బాగుంటేనే దేశం బాగుంటుందని, ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటమే ముఖ్యమని అన్నారు. దీనికోసం రోటరీ క్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు ముందుకు వచ్చి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసు, సర్పంచ్ నగిరి ప్రభావతి, ఎంపిటిసి పొడుగు కామేశ్వరరావు, రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న విజయ

కిడ్నీ ఆస్పత్రి ప్రారంభానికి నిర్లక్ష్యమెందుకు?

మాట్లాడుతున్న ఓంకార్

ప్రజాశక్తి- పలాస

కిడ్నీ ఆస్పత్రిని ప్రారంభించేందుకు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఉద్దాన ఆరోగ్య పరిరక్షణ కమిటీ నాయకులు బి.ఓంకార్, ప్రజా సంఘాల నాయకులు బి.ఆనందరావు, ఎన్.మోహనరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాశీబుగ్గ కిడ్నీ ఆస్పత్రిని గురువారం వారు సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ కిడ్నీ ఆస్పత్రికి సంబంధించి వైద్యులు, టెక్నీషియన్స్ ఇతర సిబ్బందిని నియమిస్తున్నామని జిఒ నంబరు 102ను 2019 సెప్టెంబరు 3న విడుదల చేశారని గుర్తు చేశారు. కానీ, ఇప్పటి వరకు ఒక్క పోస్టు నియమించలేదని అన్నారు. తక్షణమే పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. 200 పడకలకు 3 షిఫ్ట్‌ల్లో పనిచేయడానికి ప్రభుత్వం పేర్కొన్న 31 మంది డాక్టర్లు సంఖ్య సరిపోదని అన్నారు. దీనిని కనీసం రెట్టింపు నియామకాలు చేపట్టాలన్నారు. కిడ్నీ రోగాలకు మూలాల కనుక్కోవడానికి విస్తృత పరిశీలన చేపట్టాలన్నారు. అందుకు తగ్గ నిపుణులను రెగ్యులర్ బేస్‌లో నియమించి పరిశీలనకు తగ్గ మెడికల్ పరికరాలు సమకూరాలన్నారు. వారానికి మూడుసార్లు డయాలసిస్ కోసం రాను పోనూ ఛార్జీలు, భోజనం తదితర ఖర్చులకు ప్రభుత్వం ఇచ్చే పింఛను సరిపోవడం లేదని, రూ.20 వేలు చెల్లించాలని కోరారు. పౌష్టిక ఆహారం లేక కిడ్నీ రోగులు నీరసించిపోతున్నారని, ఇట్లాంటి వారిని గుర్తించి పాలు, గుడ్లు పౌష్టికాహారం ప్రభుత్వమే సమకూర్చలని డిమాండ్ చేశారు.

నేడు జాబ్‌మేళా

మందస : మందస మండలం హరిపురం నరేష్ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం ఉదయం 10 గంటలకు గౌతు లచ్చన్న బలహీన వర్గాల సంస్థ (గ్లో) ఆధ్వర్యాన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. బిఎస్‌సి, బికాం కంప్యూటర్స్, ఐటిఐ విభాగంలో ఫిట్టర్, డీజిల్ మెకానిక్, ఎలక్ట్రికల్ డిప్లొమా వారికి వివిధ కంపెనీల్లో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆపదలో అండగా...

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

కవిటి: కష్టాలసుడిలో... అంటూ ప్రజాశక్తిలో ఈ నెల 20న వచ్చిన కథనానికి దాతలు స్పందిస్తున్నారు. ఈ కథనం చూసి కవిటి మండలం బి.జి.పుట్టుగ గ్రామస్తులు రూ.12,300లు సేకరించారు. అదే గ్రామానికి చెందిన యువశక్తి ఫౌండేషన్ రూ.8 వేలు అందించింది. ఈ మొత్తం డబ్బులు రూ.20,300లు గ్రామానికి చెందిన యువకులు గురువారం విశాఖ వెళ్లి బాధితుడు ఎన్ని వినాయకరావుకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓవైపు తన తల్లి, మరోవైపు తాను అనారోగ్యంతో కదలలేని పరిస్థితిలో ఉన్నామని వైద్యం కోసం అప్పుచేసి రూ.4 లక్షలు ఖర్చు చేసినట్టు తెలిపారు. దీంతో దిక్కుతోచని పరిస్థితిలో ప్రజాశక్తిని సంప్రదించామని, దీనికి స్పందించి దాతలు తమకు అండగా నిలుస్తున్నారని తెలిపారు.

ఆర్థికసాయం అందిస్తున్న యువకులు

స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్

ఇసుక అక్రమ రవాణా అడ్డగింత

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం బాహుదా నదిలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా బెల్లుపడా రైతులు, పెద్దలు గురువారం అడ్డుకున్నారు. ఇటీవల తరచుగా బాహుదా నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. గురువారం బాహుదా నదిలో రైతాంగానికి ఉపయోగపడే ఛానల్ వద్దే నేరుగా ట్రాక్టరుతో ఇసుక తవ్వుతున్నారు. దీనిని తమనించిన రైతులు దొరబాబురెడ్డి, గణేష్‌లు అడ్డుకున్నారు. ట్రాక్టర్‌ను పట్టుకొని రెవెన్యూ కార్యాలయం వద్ద పెట్టినట్లు రైతు కూర్మారావు తెలిపారు.

అభినందిస్తున్న ఉపాధ్యాయులు

లక్ష్యం చేరే వరకు పట్టు వీడొద్దు

వజ్రపుకొత్తూరు: క్రీడల్లో లక్ష్యం చేరే వరకు పట్టు విడవద్దని గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.హరిబాబు విద్యార్థులకు సూచించారు. రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు నాగరాజును సిబ్బందితో కలిసి గురువారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి 27 వరకు పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి స్కూల్ ఆట పోటీలో పాల్గొంటారని అన్నారు. తమ పాఠశాల నుంచి అండర్-17 విభాగంలో దట్టి రేష్మ (హేమర్ త్రో), దట్టి కార్తీక్ (1500 మీటర్ల పరుగు పందెం), మునుకోటి గిరి (400 మీటర్ల పరుగు పందెంలో), కీలు ధనరాజు (హేమర్ త్రో) విభాగంలో పాల్గొంటారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోలాకి దిల్లేశ్వరరావు, ఉమామహేశ్వరి, అలీ బేగ్ పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణపై శిక్షణ

అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త కృష్ణవేణి

ఆమదాలవలస : వ్యవసాయ యాంత్రీకరణపై షెడ్యూల్ కులాల యువ రైతులకు గడచిన రెండు రోజుల నుంచి శిక్షణను ఇస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో యువతకు వ్యవసాయంలో వివిధ పంటల్లో నూతన రకాలు, సమగ్ర వ్యవసాయ విధానాలు, సమాచార విస్తరణలోని నూతన పోకడలను తెలియజేస్తున్నట్లు తెలిపారు. యువత జీవనోపాధికి వ్యవసాయ, అనుబంధ రంగాల్లో అనువైన జీవనోపాధి మార్గాలను డాక్టర్ ఎస్.నీలవేణి వివరించి వ్యవసాయ యాంత్రికరణపై శిక్షణ ఇచ్చారు. అనంతరం మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్ బాలకృష్ణ చేపల పెంపకంపై, ఉద్యాన నారు పెంపకంపై డాక్టర్ వి.హరి కుమార్, ఉద్యాన శాస్త్రవేత్త విలువాధారిత ఉత్పత్తులు, పుట్టగొడుగుల పెంపకంపై డాక్టర్ బి సునీత, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త వాతావరణ ఆధారిత సలహాలపై డాక్టర్ బి.మౌనిక, వివిధ సమగ్ర వ్యవసాయ విధానాలపై, ఖర్చు తగ్గించే వ్యవసాయ సలహాలను డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్ తెలియజేశారు. కార్యక్రమంలో సంత కొత్తవలస, కొండ్ర గూడెం, ఇసకలపలెం, కాగితాపల్లి, కెపివలస, ఉప్పెన వలస, బురిడివలస, గోపిదేవి పేట నుంచి షెడ్యూల్ కులయువ రైతులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

సంక్షేమం, అభివృద్ధి సిఎం జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని జాడుపల్లిలో జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్లలో విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. రైతుల కోసం రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ యాంత్రీకరణ, రైతు భరోసా వంటి పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి సంక్షేమ పథకాల బోర్డును ప్రదర్శించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజని, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంపిపి ప్రతినిధి బైపోతు ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లాన బాలరాజు, మండల పార్టీ కన్వీనర్ పల్లి యోగి, కరణం శశిభూషణరావు, ప్రసాదరావు, జయముని పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : జెండాను ఆవిష్కరిస్తున్న కృపారాణి

సోంపేట: పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను వైసిపి ప్రభుత్వం అందిస్తుందని ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసు అన్నారు. సోంపేట మండలంలోని ఇస్కలపాలెం సచివాలయం పరిధిలో గురువారం జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇసుకలపాలెం సచివాలయం పరిధిలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.25 కోట్లు నేరుగా ప్రజలకు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు శిలగాన భాస్కరరావు, ఎఎంసి వైస్ చైర్మన్ బైపల్లి రామారావు, ధర్మారావు, కామయ్య, దశరాజు, ఇఒపిఆర్‌డి వెంకట్రావు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: మండలం పోలవరం గ్రామంలో గురువారం వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి డా.కిల్లికృపారాణి పాల్గొని గ్రామంలో సమావేశం నిర్వహించారు. అనంతరం పార్టీ జండాను ఆవిష్కరించారు. గ్రామంలో పార్టీ నాయకులు, గృహసారథులతో కలిసి పర్యటించి రాష్ట్రానికి జగన్ ఎందుకు అవసరమో వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చింతాడ గణపతి, సిగిలిపల్లి మోహనరావు, బగాది హరి, ఆట్ల రాహుల్, గండి అప్పలరెడ్డి, కూర్మారావు, ధవళ లక్ష్మణరావు పాల్గొన్నారు.

బిసి భవనం పెండింగ్ పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న బిసి భవన్, స్టడీ సర్కిల్ పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు పిట్టా చంద్రపతి కోరారు. రెవిన్యూమంత్రి ధర్మాన ప్రసాదరావును గురువారం సంఘం నాయకులు కలిసి సమస్యలను వివరించారు. భవన నిర్మాణానికి రూ.6 కోట్లు నిధులు గతంలో మంజూరు చేశారని, పనులు చివరి దశలో ఉన్నాయని వివరించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా భవన నిర్మాణానికి అదనపు నిధులు అవసముందన్నారు. బిసి స్టడీసర్కిల్ నిర్వహణకు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం ప్రతినిధులు పసగాఢ రామకృష్ణ, అమిరుల్లా బేగ్, బైరి నీలమప్పుడు, జంజూలూరి రామారావు, తిప్పాన గాంధీ, దామోదర కేశవ, ఇప్పిలి చిన్నారావు ఉన్నారు.

మంత్రి ధర్మానను కలిసిన బిసి నాయకులు

వినూత్న పద్ధతిలో బోధనలు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

సాంఘిక శాస్త్ర బోధన ద్వారా విద్యార్థులను భావి భారత నిర్మాతలుగా తీర్చిదిద్దవచ్చునని ఎంఇఒ జె.చిన్నవాడు అన్నారు. సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులకు అభ్యసనాభివద్ధిపై పాఠశాల సముదాయ చైర్మన్ బి.కామరాజు అధ్యక్షతన గురువారం శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లోని అభ్యసన లోపాలు అధిగమించేందుకు ఇటువంటి శిక్షణలు ఉపయోగించుకోవాలన్నారు. పాఠశాల సముదాయ చైర్మన్ కామరాజు మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.కార్యక్రమ లక్ష్యాలు, వినూత్న బోధనా పద్ధతులను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాడాన రాజు, కె.రాజేశ్వరరావు, కె.భానుమూర్తి, చందనరావు, మురళి, విష్ణు, తవిటిరెడ్డి, రామారావు, శివప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒ చిన్నవాడు

ప్రజలకు అందుబాటులో ఉండాలి

మొక్కను నాటుతున్న రమణ

పలాస: సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని టెక్కలి డివిజన్ పంచాయతీ విస్తరణ అధికారి ఐ.వి.రమణ ఆదేశించారు. మండలంలోని రెంటికోట సచివాలయాన్ని గురువారం సందర్శించి పంచాయతీ రికార్డులను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరు, ఇంటి పన్ను వసూళ్ల వేగవంతంపై సమీక్షించారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. గ్రామ పంచాయతీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, ఎటువంటి అవకతవకలకు పాల్పడితే కఠినంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తడి, పొడి చెత్త నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ శాసనపురి తిరుమలరావు, మండల పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, కార్యదర్శి సద్గుణబాబు పాల్గొన్నారు.

ఒబిసిలో చేర్చేందుకు కృషి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర జిల్లాల్లోని తూర్పు కాపు, సొండి, కళింగ వైశ్య, శిష్టకరణాలు, అరవ కులాల ను ఒబిసిలో చేర్చాలని ఎన్‌సిబిసిని కోరినట్లు బిజెపి రాజ్యసభ ఎంపీ జి.వి.ఎల్ నరసింహారావు అన్నారు. దీనిపై ఎన్‌సిబిసి సానుకూలంగా స్పందించి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సులు చేసిందని చెప్పారు. శ్రీకాకుళం నగరంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ కులాలను త్వరలో ఒబిసి జాబితాలో కేంద్ర ప్రభుత్వం చేరుస్తుందన్నారు. ఉత్తరాంధ్ర లోని ప్రధాన సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను బలోపేతం చేసే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. రైల్వేజోన్‌ను వీలైనంత త్వరగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ భద్రాచలం

'ఉపాధి'తో వలసల నివారణ

కవిటి: వలసల నివారణే లక్ష్యంగా ప్రభుత్వం ఉపాధి హామీ పథకం అమలు చేస్తున్నట్టు దుగానపుట్టుగ సర్పంచ్ డి.భద్రాచలం తెలిపారు. దుగానపుట్టుగ సచివాలయంలో ఉపాధి హామీ పనులపై గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ ఉపాధి పనులు కలిపిస్తున్నట్టు తెలిపారు. 2023-24 సంవత్సరానికి గాను రూ.50 లక్షల అంచనాతో 10 పనులు మంజూరు కోసం ప్రణాళికలు పంపించినట్లు చెప్పారు. ఎన్‌ఆర్‌జిఎస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న సభ్యులు

అభాగ్యులకు అండ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అభాగ్యులకు యువతరం సేవా సమితి అండగా నిలుస్తుందని సమితి అధ్యక్షుడు చింత మురళి అన్నారు. మండలంలోని చిన్నబచ్చాలవానిపేటకు చెందిన పేద కుటుంబానికి రూ.20 వేలు ఆర్థికసాయం చెక్ రూపంలో గురువారం అందించారు. రెండు నెలల చిన్నారి వేదశ్రీ అస్వస్థతకు గురికావడంతో వైద్యులకు సంప్రదించగా బ్రెయిన్ సంబంధిత వ్యాధికి గురైనట్లు తెలిపారు. వైద్యానికి రూ.6 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. పేద పరిస్థితి కారణంగా తల్లి ఆదిలక్ష్మి ఆర్థిక సాయం కోరారు. దీనికి స్పందించి యువతరం సేవా సమితి సభ్యులు విరాళాలు సేకరించి పాప వైద్యానికి తమవంతు సహకారం అందించారు. కార్యక్రమంలో యువతరం సేవా సమితి అధ్యక్షుడు చింత మురళి, కార్యదర్శి గోరకల అశోక్, ఇన్‌ఛార్జిలు దున్న పెంటరావు, సైని లక్ష్మణరావు, సైనీ ప్రతాప్, సైనీ రమేష్, గోరకల సునీల్, బత్తిని గణేష్, కర్ని డిల్లేష్, దున్న ప్రసాద్, మల్లెన జగదీష్, మాదనాల వెంకటరమణ, నగరంపల్లి నారాయణ పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం

రణస్థలం: మండలంలో ముక్తుంపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న వరి పొలాల్లో గురువారం పంటకోత ప్రయోగాలు ప్రకృతి వ్యవసాయ ఇడిఎంఎంటి జి.రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ దుక్క అప్పల స్వామి, నరసయ్య రైతుల వరి పొలాల్లో పంటకోత ప్రయోగాలు నిర్వహించడం జరిగిందని, వీరు పొలాల్లో ప్రకృతి వ్యవసాయం చేయడం వలన ఎటువంటి దిగుబడి తగ్గలేదని, పెట్టుబడి తగ్గి మంచి దిగుబడి రావడం జరిగిందని అంచనా వేశామన్నారు. పక్క రైతులకు ప్రకృతి వ్యవసాయానికి, రసాయన వ్యవసాయానికి మధ్య వ్యత్యాసాలు చెప్పి మిగతా రైతులందరూ రానున్న రోజుల్లో ప్రకృతి వ్యవసాయం చేయాలని, అందులో దిగుబడులు పెంచుకోవాలని రైతులకు సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వలన పర్యావరణం కాలుష్యం తగ్గి, భూసారం పెరిగి, భూమిలో కార్బన్ శాతం పెరిగి రానున్న కాలంలో మంచి పంటలు పండించుకోవచ్చని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పి.సత్యనారాయణ, ఎస్.సన్యాసిరావు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం చేస్తున్న సిబ్బంది

పలుచోట్ల అన్నదానం

కవిటి: మండలంలోని బొరివంకలో కాళీమాత ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో నిర్మించిన భోజనశాల గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్తీక ఏకాదశిని పురస్కరించుకుని పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు ఆలయానికి పోటెత్తారు. జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియ విజయ, ఎమ్మెల్యే బెందాలం అశోక్, స్థానిక నాయకులు కాళీమాతను దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానంలో మూడు వేల మంది యాత్రికులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని గోవిందపురంలో సత్య సాయిబాబా జన్మదినం సందర్భంగా రెండు వేల మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు, సర్పంచ్ ప్రతినిధి పాలిన చిరంజీవి, సన్యాసిరావు, వెంకటరావు, భగవాన్, శేఖర్, నిహాల్ పాల్గొన్నారు.

బూర్జ: మండలంలో సత్యసాయి బాబా జన్మదిన దినోత్సవం సందర్భంగా 18వేల మందికి, మండలంలో మదనాపురం కాశీ విశ్వేశ్వర ఆలయంలో 5 వేల మందికి, చిన్నలంకాం గ్రామంలో సాయిబాబా మందిరం దగ్గర 2వేల మందికి, అల్లెన గ్రామంలో 2వేల మందికి, డొంకలపర్తలో 2,500 మందికి, బూర్జ సాయిబాబా మందిరం దగ్గర 3వేల మందికి అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే లక్కుపురం శ్రీ సత్యనారాయణ ఆలయం వద్ద ఏకాదశి సందర్భంగా 3,500 మందికి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయకమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

పొందూరు: మండలం తోలాపి గ్రామంలో సత్యసాయిబాబా జన్మదిన వేడుకలు సందర్భంగా గురువారం భారీ నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి పరిసర గ్రామాల నుంచి వేలాది మంది ప్రజలు హాజరయ్యారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కవిటి : అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

పలాస : పలాస పెద్ద వీధిలో కార్తీక ఏకాదశి సందర్భంగా పది వేల మందికి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అలాగే మండలంలో బ్రాహ్మణతర్ల, మరదరాజపురం తదితర గ్రామాల్లోనూ అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

క్రీడాకారులకు అభినందనలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పురుషోత్తపురం పాఠశాల విద్యార్థులు కరాటే పోటీలో సత్తాచాటారు. జూన్ 11న విశాఖలో జరిగిన జాతీయస్థాయి పోటీలలో పురుషోత్తపురం పురపాలక ఉన్నత పాఠశాలకు చెందిన టి.సాయి ప్రియ, డి.పూజలు ప్రథమ స్థానం సాధించి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 24,25,26 తేదీల్లో విశాఖపట్నం పోర్టు స్టేడియంలో జరగనున్న అంతర్జాతీయ కరాటే ఛాంపియన్ షిప్‌లో పాల్గొన్నట్లు హెచ్ఎం వై.లత తెలిపారు. ఈ మేరకు గురువారం బయలుదేరుతున్న సందర్భంగా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కోచ్ ప్రకాష్, ఉపాధ్యాయులు రాజగోపాల్, రాంప్రసాద్, తేజేశ్వరరావు, జయలక్ష్మి, సత్యవాణి, ఆదిలక్ష్మి, మోహన్, ధర్మరావు పాల్గొన్నారు.

అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

పొందూరు : లబ్ధిదారులతో మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలం నందివాడలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రతి గడపకు వెళ్లి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇంటింటికి అందజేసిన లబ్ధిని చదివి వినిపించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, సర్పంచ్ మజ్జి శైలజ, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, మండల వైసిపి అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్ బడాన సునీల్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలో 43 పంచాయతీల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సిఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో ప్రారంభించిన పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి గిరిజన గ్రామాలు, మారుమూల గ్రామాల్లో తిరిగి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల పోస్టర్లను అందజేశారు. గురువారం కార్యక్రమం ముగింపు సందర్భంగా మెట్టూరు నుంచి కొత్తూరు వరకు కార్యకర్తలు, నాయకులతో పెద్దఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రములోని నాలుగు రోడ్లు కూడలి నుంచి బాణసంచా మధ్య ఊరేగింపుగా బజారువీధి, పెద్దవీధి, సరిపిల్లి వీధి, చెవిటమ్మ తల్లి వీధి, బోర వీధుల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టి విజయవంతంగా ముగింపు పలికారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కృష్ణ వేణి, మొజ్జాడ రుక్మిణి, ఎంపిటిసిలు గండివలస రత్నకుమారి, వనుమ లక్ష్మి నారాయణ, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, వైసిపి నాయకులు జి.ఆనందరావు, ఎల్.తిరుపతిరావు, బి.శ్రీను, ఎం.చక్రపాణి, అశోక్ కుమార్, బాలకృష్ణ, లక్ష్మణరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

కొత్తూరు : ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

విద్యార్థులకు ఆహారాన్ని పంపిణీ చేస్తున్న రవికుమార్

సేవా మార్గం అనుసరణీయం

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

సత్యసాయి చూపిన సేవామార్గం అనుసరణీయమని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. గురువారం సత్యసాయి జయంతిని పురస్కరించుకొని పట్టణంలో లక్ష్మీ నగర్‌వీధిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం మెట్టక్కివలసలో సత్యసాయి మందిరం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ఆహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సత్యసాయి దేశానికే ఆదర్శమన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సభ్యులు మునగవలస రవీంద్రబాబు, కె.మల్లేశ్వరరావు, ప్రహ్లాదరావు, కన్నేపల్లి కామావధానులు, అన్నెపు సత్యం పాల్గొన్నారు.

రోగులను బస్సులో తరలిస్తున్న సిబ్బంది

నేత్రాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- రణస్థలం

నేత్ర ఆరోగ్యానికి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని కళ్యాణి కంటి ఆస్పత్రి పారామెడికల్ అప్తాలమిక్ ఆఫీసర్ ఎస్.కళ్యాణి తెలిపారు. మండల కేంద్రం బ్రహ్మణవీధిలో ఉన్న కళ్యాణి కంటి ఆస్పత్రి ఆవరణలో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 93 మంది హాజరయ్యారు. నేత్ర పరీక్షలు నిర్వహించి 22 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ ఇంద్రియాలు అన్నింటిలో కన్ను ప్రధానమైనదని, చూపును ప్రసాదించే కళ్లను సంరక్షించుకోవడం మన బాధ్యతన్నారు. కంప్యూటర్ ముందు ఎక్కువసేపు పనిచేసేవారు తప్పనిసరిగా మధ్యలో కాస్త విరామం తీసుకోవాలని, అలాగే కంటి రెప్పలను ఆడిస్తుండాలని, దీనివల్ల కళ్ల పొడిబారకుండా ఉంటాయన్నారు. అలాగే కళ్లను తరచుగా చేతితో తాకడం మంచిది కాదన్నారు. కంటిచూపు మసకబారటం, కంటినొప్పి, కళ్లముందు మిరుమిట్లు గొలిపే కాంతులు మెరవడం వంటి లక్షణాలు కనిపిస్తే డాక్టర్‌ను సంప్రదించాలని కోరారు.

పెద్దపాడు ప్రాంతాలకు సురక్షిత నీరు

శంకుస్థాపన చేస్తున్న రామ్ మనోహర్‌నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధిలో పెద్దపాడు గ్రామంతో పాటు పరిసర ప్రాంతాలైన గాంధీనగర్ కాలనీ, జాడపేటలకు సుమారు రూ.40.70 లక్షల వ్యయంతో నిర్మించనున్న రక్షిత మంచినీటి పథకానికి, 150 కుటుంబాలకు తాగునీటి కుళాయిల ఏర్పాటుకు వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే పరిసర ప్రాంత వాసులకు తాగునీటి సమస్య తీరుతుందని ఆయన చెప్పారు. భూగర్భంలో రాతినేల కావడం వల్ల ఈ ప్రాంతంలో బోర్లు, బావులు తవ్వుకున్నా వేసవిలో నీరందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి దాహార్తిని తీర్చడానికి మంత్రి ధర్మాన ప్రసాదరావు వ్యక్తిగత శ్రద్ధతో ఈ ప్రాజెక్టును మంజూరు చేసినట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగ పర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గుర్ర రవి యాదవ్, నక్క దేవానంద్, బొట్ట సింధూ యాదవ్, పల్ల శ్రీరాములు, దశరథ, ఈశ్వర్ పాల్గొన్నారు.

పాడైన పంటను పరిశీలిస్తున్న వాణి

పాడైన పంటలు పరిశీలన

నందిగాం : మండలంలో ఖల్లాడ, కందులగూడెం, మదనాపురం, బర్సుపురం గ్రామాల్లో వర్షాభావం పరిస్థితుల వల్ల పంటలు పాడయ్యాయి. దీంతో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి పాడైన పంటలను గురువారం పరిశీలించారు. పాడైపోయిన పంటకు నష్టపరిహారం ఇప్పిస్తామని భరోసా ఇచ్చారు. నందిగాం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించమని ఇంతకుముందే కలెక్టర్ తెలియజేశానని తెలిపారు. సిఎం జగన్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి నందిగాం మండలాన్ని కరువు మండలంగా గుర్తించేందుకు తమ వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు.

26న 'చలో రణస్థలం'

రణస్థలం: ఈ నెల 26న ఛలో రణస్థలం విజయవంతం చేయాలని దళిత మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రాము ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు. భారతదేశ రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా రణస్థలం మండల కేంద్రంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల అలంకరణ చేయుటకు మండల దళిత మహాసభ సంఘ సభ్యు లందరూ ఆదివారం ఉదయం 10 గంటలకు అంబేద్కర్ విగ్రహం దగ్గరకు హాజరు కావాలని కోరారు. హైస్కూల్ ఆవరణలో మహాసభ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పురంధేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలి

పోలాకి: బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని నరసన్నపేట నియోజకవర్గ కన్వీనర్ జి.భాగ్యలక్ష్మి కోరారు. మండలం కేంద్రంలోని బిజెపి నాయకులతో గురువారం సమావేశం నిర్వ హించారు. శ్రీకాకుళంలోని శాంతి కన్వెన్షన్ హాలులో జిల్లా ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహి స్తున్నట్లు తెలిపారు. కార్య క్రమంలో కో-కన్వీనర్ కరుకోల రామారావు, సీనియర్ నాయకులు ఎ.పి.మహారణ, జిల్లా ఉపాధ్యక్షులు కె.మునెమ్మ, ఒబిసి మోర్చ జిల్లా జనరల్ సెక్రటరీ ఎంద శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు బుద్ధా రాంబాబు, కిల్లి లక్ష్మణరావు, కిల్లి అప్పన్న పాల్గొన్నారు.

స్థలం కేటాయింపుపై అభ్యంతరం

ఇచ్ఛాపురం : పట్టణంలో పాతాళ సిద్ధేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే దారి జగన్నన్న కాలనీకి సమీపంలో ఇటీవల క్రిస్టియన్ మైనారిటీ సామాజిక భవన నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించింది. దీనిపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ... గురువారం తహశీల్దార్ గురుప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఆలయంలో నిత్యం అయ్యప్ప, శివ, ఆంజనేయస్వామి దీక్షలు ఉంటాయని, దీంతో యాత్రికులు వచ్చేందుకు ఇబ్బందులు పడతాయని అన్నారు. వారికి మరోచోట స్థలం కేటాయించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంజీవరెడ్డి, ఆసి చిరంజీవిలురెడ్డి, కొండశంకర్‌రెడ్డి, దక్కత విశ్వనాథ్‌రెడ్డి, బదే దొరబాబురెడ్డి, కూర్మారావు, ఎర్రయ్యరెడ్డి పాల్గొన్నారు.

బేస్‌బాల్‌లో గురుకులం విద్యార్థికి రజతం

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-14 బాలబాలికల బేస్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పెద్దపాడు అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి బి.దీక్షిత ప్రతిభ కనపర్చి రజిత పతకాన్ని సాధించింది. పాఠశాలలో 8వ తరగతి చదవుతున్న దీక్షిత రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా గురువారం ఆమెను ప్రిన్సిపాల్ మార్పు జ్యోతి అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లో ప్రతి విద్యార్థి రాణించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.మాధవి లత, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.పుష్పవేణి, పిఇటి జయశ్రీ, వార్డెన్ హాఫీజ్ బేగం పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టడం నేరం

ప్రజాశక్తి- పలాస

బాల లను పనిలో పెట్టడం, వారితో పనులు చేయించ డం చట్టరీత్యా నేరమని న్యాయవాది పిండి వెంకటరావు అన్నారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యాన పలాస-కాశీబుగ్గలోని పలు దుకాణాల్లో న్యాయవాదులు, అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. 14 ఏళ్ల నిండని బాలబాలికలకు దుకాణాల్లో, షాపుల్లో, గృహాల్లో పనుల్లో తల్లిదండ్రులు పెట్టకుండా బడికి పంపించాలన్నారు. బాలలను పనుల్లో పెట్టుకుంటే సంబంధిత యజమానులపై కేసు నమోదవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో లేబర్ అధికారి విజయ్ కుమార్, ఎబిటియు ఎస్.ఐ.కేశవరావు, ఐసిపిఎస్ అధికారి సీతారాం, బ్రైట్స్ సంస్థ తరపున గణపతి, చైల్డ్‌లైన్ తరుపున రాజు, మండల లీగల్ సర్వీసెస్ సభ్యులు పాల్గొన్నారు.

సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

వైసిపికి ఎదురుదెబ్బ

ప్రజాశక్తి- పొందూరు

మండలంలో వైసిపికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. వైసిపికి పట్టున్న బాణాం పంచాయతీ తాడేం గ్రామంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ సమక్షంలో గ్రామానికి చెందిన బాకి సన్యాసిరెడ్డి, బాకి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో 300 మంది టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా రవికుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసిపి పాలనలో తమ గ్రామంలో అభివృద్ధి లేకుండా పోయిందని, రవికుమార్‌పై తమకు సంపూర్ణ నమ్మకం ఉందని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రామ్మోహన్, నాయకులు కూన సత్యనారాయణ, అన్నెపు రాము, సీపాన శ్రీరంగనాయకులు, బలగ శంకరభాస్కర్, గాడు నారాయణరావు, వండాన మురళి, బాడాన గిరి, ఎ.చినరంగ, చింతాడ కృష్ణ వాసుదేవరావు, వరదరాజులు, కింజరాపు రమణ, ఎస్. మధు పాల్గొన్నారు.

రవికుమార్ సమక్షంలో టిడిపిలో చేరుతున్న పలువురు

సెమినార్‌కు అన్నంనాయుడు ఎంపిక

శ్రీకాకుళం అర్బన్ :విశాఖలో ఈ నెల 25, 26 తేదీల్లో జరగనున్న జాతీయ సెమినార్‌కు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కూన అన్నంనాయుడు ఎంపికయ్యారు. ఆయన రాష్ట్ర ప్రతినిధిగా ఈ సెమినార్‌కు హాజరు కానున్నారు. ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి రేఖాశర్మ అధ్యక్షతన ఈసెమినార్ జరగనుంది. ఈ సెమినార్‌కు దేశవ్యాప్తంగా వివిధ ఉన్నతస్థాయిలో ఉన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు హాజరు కానున్నారు. విశాఖలోని దసపల్లా హోటల్‌లో జరగనున్న ఈ సెమినార్‌కు ఆయన హాజరై రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ అంశాలపై మాట్లాడనున్నారు. ఆయన ఎంపిక పట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు, కార్యదర్శి పి.రాము హర్షం వ్యక్తం చేశారు.

అన్నంనాయుడు